## దేశంలోని 21 ప్రఖ్యాత దవాఖానల్లో సూపర్‌బగ్స్

### రోగుల ప్రాణాలకు ముప్పు : ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశవ్యాప్తంగా 21 ప్రఖ్యాత దవాఖానల్లో 'సూపర్‌బగ్స్' ఉన్నాయని, అక్కడ వైద్య సేవలు పొందుతున్న రోగుల ప్రాణాలకు తీవ్ర ముప్పు పొంచి ఉందని ఐసీఎంఆర్ (భారత వైద్య పరిశోధన మండలి) తాజా నివేదిక హెచ్చరించింది. ఎయిమ్స్ ఢిల్లీ, పీజీఐ–చండీగఢ్, అపోలో దవాఖాన–చెన్నై, గంగారామ్ దవాఖాన–ఢిల్లీ.. తదితర దవాఖానాల్లో రోగుల రక్తం, మూత్రం నమూనాల్లో సూపర్‌బగ్స్ ఉన్నట్టు గుర్తించామని నివేదిక తెలిపింది.

## చేయని నేరానికి జైలు.. 420 కోట్ల పరిహారం

షికాగో: అమెరికాలోని షికాగోలో చేయని నేరానికి జైలు శిక్ష అనుభవించిన నిర్దోషికి దాదాపు రూ.420 కోట్ల పరిహారం దక్కనుంది. 2008లో షికాగోలోని ఓ పార్కు వద్ద జరిగిన కాల్పుల్లో 19 ఏండ్ల యువకుడు మరణించాడు. కాల్పులకు పాల్పడింది మార్సెల్ బ్రౌన్(అప్పుడు వయసు 18) అని పోలీసులు నేరారోపణలు చేశారు. దీంతో కోర్టు బ్రౌన్‌కు 35 ఏండ్ల జైలు శిక్ష విధించింది. అయితే, ఈ నేరానికి పాల్పడింది బ్రౌన్ కాదని తర్వాత తేలింది. దీంతో పదేండ్ల పాటు శిక్షను అనుభవించిన తర్వాత 2018లో ఆయన జైలు శిక్షను కోర్టు రద్దు చేసింది.

## యాపిల్‌కు 1.2 లక్షల కోట్లు జరిమానా

న్యూఢిల్లీ: యాపిల్‌కు యూరప్‌లో ఎదురుదెబ్బ తగిలింది. ఐర్లాండ్ నుంచి పొందిన 14.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.2 లక్షల కోట్లు) పన్ను ప్రయోజనాలను తిరిగి ఆ దేశానికి చెల్లించాలంటూ ఈసీజే తీర్పు చెప్పింది.




















